# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 16వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు.
- ❖ ఆంధ్రప్రదేశ్, అస్సాం రాష్ట్రాలు జనాబా ప్రాతిపధికన అదనపు ప్రాదాన్యత కోరుతున్నాయని 16వ ఆర్థిక సంఘం తెలిపింది.
- ❖ సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ పేరుని ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రతిపాదించారు.
- ❖ సింహాచలం చందనోత్సవం ఏర్పాట్లపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈరోజు సమీక్షించారు.
- ❖ విదేశీ పెట్టుబడిదారులు వచ్చేందుకు వీలుగా అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.

========================

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి తోడ్పాటు నందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 16వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆర్థిక సంఘానికి సచివాలయం మొదటి బ్లాక్ వద్ద ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. అనంతరం సచివాలయం మొదటి బ్లాక్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు వంటి అంశాలపై ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. భారతదేశాన్ని 2047 నాటికి “వికసిత్ భారత్”గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో భాగంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపొందించామని తెలిపారు. ప్రతి కుటుంబానికి కనీస అవసరాలు తీర్చడమే దీని లక్ష్యమని పేర్కొన్నారు. జీరో పావర్టీ లక్ష్యంగా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను, అత్యున్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది సంపన్నులు ఆదుకునేలా పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన వాట్సాప్ గవర్నెన్స్ కార్యక్రమాన్ని ఆర్థిక సంఘం సభ్యులు ప్రశంసించారు.

========================

ఆంధ్రప్రదేశ్, అస్సాం రాష్ట్రాలు జనాబా ప్రాతిపధికన అదనపు పాదాన్యత కోరుతున్నాయని 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియా తెలియజేశారు. పనగారియా నేతృత్వంలోని సిఫార్సులు 2026 జనవరి నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో అన్నీ రాష్ట్రాలలో పర్యటించి స్థానిక పరిస్థితులు ఆర్థిక సంఘం తెలుసుకుంటోంది. ఇప్పటికే 22 రాష్ట్రాలలో పర్యటించింది. అందులో భాగంగా ఈరోజు రాష్ట్రానికి వచ్చిన ఆర్థిక సంఘం ముఖ్యమంత్రితో సమావేశమయ్యింది. ఈ సందర్భంగా ఈరోజు విజయవాడలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఛైర్మన్ అరవింద్ పనగారియా మాట్లాడుతూ... స్థానిక సంస్థలకు కేటాయించాల్సిన గ్రాంట్లను నిర్ణయిస్తుందని చెప్పారు. ప్రత్యేక హోదా ఇప్పుడు ఎవరికీ ఇవ్వట్లేదాని ఆయన స్పష్టం చేస్తూ... రాష్ట్రాల పన్నుల వాటా 42 శాతానికి పెరిగిందని ఆన పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

========================

సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషన్ రామకృష్ణ గవాయ్ పేరుని ప్రస్తుత సీజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రతిపాదించారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం మే 13వ తేదీన ముగియనుంది. తదుపరి సీజేఐ పేరును ప్రతిపాదించాలని జస్టిస్ సంజీవ్ ఖన్నాను న్యాయశాఖ కోరగా, ఆయన జస్టిస్ BR గవాయ్ పేరును ప్రతిపాదించారు. దీంతో మే 14వ తేదీన జస్టిస్ గవాయ్ భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన 6 నెలల పాటు ఆ బాధ్యత నిర్వహించి నవంబర్‌లో పదవీ విరమణ చేస్తారు.

========================

ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి చందనోత్సవం ఏర్పాట్లపై దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటూ మంత్రుల బృందం ఈరోజు సమీక్షించింది. నిర్వహణ, ఆలయ అభివృద్ధి, పంచ గ్రామాల సమస్య పరిష్కారంపై మంత్రులు ఈ రోజు సమీక్ష నిర్వహించారు. సింహగిరిపై దేవస్థానం కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, అనగాని సత్యప్రసాద్, ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, ఆలయ అధికారులు, పలువురు శాసన సభ్యులు పాల్గొన్నారు. 30va చందనోత్సవం నిర్వహణతో పాటు ఆలయ అభివృద్ధి, పంచ గ్రామాల సమస్య పరిష్కారంపై కూడా ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ....

(వాయిస్ 38 సెకన్లు)

విరామం

========================

రాష్ట్ర సచివాలయ టవర్ల నిర్మాణం కోసం సీఆర్డీఏ టెండర్లను ఆహ్వానించింది. అమరావతిలోని సచివాలయం కోసం నాలుగు టవర్లు, హెచ్ఓడీ కార్యాలయాల కోసం మరో టవర్ నిర్మాణం కోసం టెండర్లను జారీ చేసింది. మొత్తం 5 టవర్లను 4,668 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టాలని నిర్ణయించింది. కాగా శాసనసభ, హైకోర్టు, సచివాలయం భవన నిర్మాణాలకు ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో ఆమోదం లభించింది.

========================

అమరావతి కోసం భూములిచ్చిన రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని రాజధాని నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. ఈరోజు ఆయన

పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... అమరావతి నిర్మాణం అంటే కేవలం మౌళిక వసతుల కల్పన మాత్రమే కాదని యువతకు ఉద్యోగాల కల్పన కూడా అని అన్నారు. రాజధానిలో స్మార్ట్ ఇండస్ట్రీస్ ద్వారా ఉద్యోగాలు కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు కోసం విదేశీ పెట్టుబడిదారులు అమరావతికి రావల్సి ఉంటుందని, ఆ మేరకు రాజధానిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండాలని మంత్రి నారాయణ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

=========================

సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐడి ఐజి ఆకే రవికృష్ణ కోరారు. ఆడపిల్లలతో అశ్లీల వీడియోలు చేసి, విదేశీ వెబ్ సైట్ల ద్వారా డబ్బు సంపాదించే ఒక ముఠాను బెంగుళూరు, గుంతకల్లు ప్రాంతాలలో ఈరోజు అరెస్ట్ చేశారు. అనంతరం గుంటూరులోని సిఐడి ప్రాంతీయ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాలలోని అమ్మాయిలను ఇటువంటి ముఠాలు లక్ష్యంగా చేస్తున్నాయని అన్నారు. దేశంలో అశ్లీల వీడియోలపై కఠిన చట్టాలున్నాయని, ప్రజలు ఎవరిపైనైనా అనుమానం ఉంటే వెంటనే జాతీయ స్థాయి సైబర్ క్రైమ్ కాల్ సెంటర్ నంబరు 1930కి ఫోన్ చేసి తెలియచేయాలని కోరారు. ఇంటర్నెట్ లో పిల్లలను మభ్యపెట్టి ఇటువంటి నేరాలవైపు ప్రోద్బలం చేసే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

=========================

ప్రకాశం జిల్లా వ్యాప్తంగా పోషన్ పక్వాడా పక్షోత్సవాలు జరుగుతున్నాయి. ప్రతి రోజు ఒక్కో అంశంపై అంగన్ వాడీ కేంద్రాల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఈరోజు జిల్లాలోని అన్ని అంగన్ వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సామూహిక శీమంతాలు నిర్వహించి తల్లి, బిడ్డ సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఒంగోలు రాజాపానగల్ రోడ్డులోని అంగన్ వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎం.అనురాధ ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ 27 సెకన్లు)

=========================

శ్రీకాకుళం జిల్లా బారువ బీచ్ ఫెస్టివల్ ను ఈ నెల 19వ తేదీన నిర్వహిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. బారువ బీచ్ ను పర్యాటకుల కోసం అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ రోజు సోంపేట మండలం బారువ సముద్ర తీర ప్రాంతాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... అంతరించిపోతున్న ఆలివ్ గ్రీన్ తాబేళ్ల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని వెల్లడించారు. మత్స్య సంపద అభివృద్ధికి బాటలు వేసే ఆలివ్ గ్రీన్ తాబేళ్ల జాతి పరిరక్షణకు జిల్లాలో 12 ప్రాంతాల్లో హెచరిష్ ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు.

=========================

నైరుతి బంగాళాఖాతం మరియు దానికి ఆనుకుని ఉన్న తమిళనాడు మీదుగా సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉన్న నిన్నటి ఉపరితల ఆవర్తనం ఈ రోజు బలహీన పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. బలమైన ఈదురు గాలులు గంటకు 40 నుండి 50 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

=========================

=========================